స్కెచ్ :

# నిజమా?

అమరేంద్ర

శర్మకి సాహిత్యంమీద ప్రీతి వుంది. కవులన్నా రచయితలన్నా ఎంతో అభిమానం వున్నదాన్ని కొండంతచేసి చాటుకోటం అతనికి సరదా. రచయితలతో ఉత్తర ప్రత్యుత్తరాలు నడపటం, వాళ్ళ జాబులకోసం ఫోటోలకోసం వర్షాగమనం ఎప్పుడా అని నిరీక్షించే చాతకపక్షిలా ఎదురుచూస్తూ వుంటాడు. ఫలానా కవి నాకు ఉత్తరం రాశాడు, ఆ రచయిత్రి తన సంతకంతో ఇటీవల వెలువరించిన నవల నాకు పంపింది అని నలుగురిలో చెప్పుకోటం అతనికి అలవాటు ఊళ్ళో సంగీతం, సంస్కృతీ, సాహిత్యం, శిల్పం వంటి విషయాలకి సంబంధించిన సభ ఏదైనా జరిగితే శర్మ మొట్టమొదటి వరసలో మొదటి కుర్చీలో వుంటాడు. అస్త్రవిద్యా ప్రవీణుడి అమ్ముల పొదిలాగా చంకలో ఒక లెదర్‌బాగ్, వల్లెవాటుగా వేసుకున్న గోధుమరంగు కాశ్మీరు శాలువా పెదిమల మీద అతికించుకున్నట్లుగా ఎప్పుడూ ఒక చిరునవ్వూ. అన్ని కాలాలలోనూ మెల్ల కన్నుని దాచుకునేటందుకు కొత్త నల్లకళ్ళజోడూ శర్మకి ఆభరణాలు రచయితలకి సన్మాన పత్రాలూ ఖద్దరు శాలువాలూ సమర్పిస్తూ వుంటాడు. ఏటా ఒక కవీశ్వరుణ్ని సత్కరించటం ఆచారంగా ఏర్పరుచుకున్నాడు.

"కవి చక్రవర్తిగారు నేను ఎంత చెబితే అంత.... ఆ రచయిత్రిని నేను బాగా ఎరుగుదును. వాళ్ళ అతిథిగా భోజనం కూడా చేశాను. పండిత ప్రకాండునికి గండపెండేరం వేస్తుంటే నేను పక్కనే ఉన్నాను. అదుగో పత్రికలో పడ్డ ఫోటో సాక్ష్యం...." ఇటువంటి కబుర్లతో తన సాహిత్యాభిమానాన్ని చాటుకుంటూ వుంటాడు. తను ఏమీ రాయడు. కాని తనలాటి వాళ్ళు లేకపోతే సాహిత్యం వర్ధిల్లదని అతనికి గట్టినమ్మకం. నిరంతర కావ్యపరిశీలన వల్ల మనోముకురం విశదీభూతమైన సహృదయులంటే తన బాపతు వాళ్ళే అని అతనికి దృఢవిశ్వాసం పూర్వార్జితపు ఆస్తి కర్పూరంలా వెలిగిస్తూ, వెలువడిన కొత్త పుస్తకాలన్నీ కొని ఇంట్లో గ్రంధాలయం పెద్దదిచేస్తూ సాహితీ ప్రియుడుగా కాలం వెళ్ళదీస్తున్నాడు

ఈ మధ్యన శర్మగారికి కొత్త కవి ఒకాయన మీద అపరిమితమైన అభిమానం ఏర్పడింది. ఆయన్ని ఆహ్వానించి కావ్యగానం చేయించి అయిదు రూపాయలు మించని అలికిరకపు శాలువాతో సన్మానం చేశాడు. అల్ప సంతోషియైన ఆ కవి పుంగవుడు ఏనుగెక్కినంత పొంగిపోయాడు తరవాత ఇద్దరికీ ఎడతెగకుండా ఉత్తర ప్రత్యుత్తరాలు సాగిపోయాయి. ఆయన లేఖినినుంచి వచ్చిన ప్రతి అక్షరమూ ఇక్షురసమనీ లక్షల విలువ చేస్తుందనీ శర్మ అభిమానంతో అనేవాడు, ఆ కవిగారి కావ్య పరంపరని గురించి ప్రశంసా పూర్వకమైన వ్యాసాలు రాయించి పత్రికలకి పంపాడు దీని ఫలితంగా శర్మలాటి సారస్వతాభిమాని దేశంలో లేడని కవిగారికికూడా గౌరవం ఏర్పడింది.

ఈ మధ్య శర్మకి పెద్ద జిజ్ఞాస పట్టుకుంది, తన అభిమాన కవి ఇంత అందమైన కావ్యనాయికలని ఎల్లా సృష్టించగలుగుతున్నాడు? ఏ నాయికని చిత్రించినా సృష్టిలోని లావణ్యమంతా తెచ్చి ముద్దచేసి రూపురేఖలు దిద్దుతాడు. అనంతాకాశపు నీలినీడలు దోబూచులాడే కళ్ళు, కౌతుకతో పదునెక్కిన తూపులవంటి చూపులు పల్లవాధరాలు, కోమల బాహువల్లరు, మృదు పాద పద్మాలు, మల్లెమొగ్గలవంటి దానిమ్మగింజలవంటి పలువరస, మబ్బులదొంతరల వంటి కుటిల కుంతలాలు, అరలవంటి నీలాలకలు, తేనెల సోనలవంటి పలుకులు విశాల ఫాలభాగాన నెలవంకలాగా తిలక రేఖల సోయగాలు ప్రదర్శిస్తూ ఒక నాయికని మించిపోతోంది మరోక నాయిక. ఆనంద పారవశ్యంతో ముంచివేసే రసవాహినీ తరంగ మాలికలుగా డోలికలుగా తూగుతూ పొంగి వస్తున్నాయి యువహృదయాలన్నీ కవిగారికి నీరాజనాలు సమర్పిస్తున్నాయి. ఆయన పూర్వకవుల నాయికలకే కొత్తరేఖలు దిద్దుతాడు ఒకప్పుడు కొత్తనాయికలని సృష్టిచేస్తాడు. అన్ని సందర్భాలలోనూ అపూర్వమైన అద్భుత సౌందర్యానుభూతి కలిగేట్లుగా పఠితలని ఉర్రూతలూగిస్తున్నాడు. ఏనాడో అంతరించిపోయిన సౌందర్యపిపాసనీ కల్పనా విన్యాసాలనీ రసరమణీయక కలాపాలనీ పునరుద్ధరించ కలిగాడు

దీనికి బలీయమైన కారణం వుండితీరాలి. ప్రతి కళాఖండం వెనకా ఒక లావణ్యరాశి వుండితీరుతుంది ఆ రమణీమణి ప్రేరణంవల్లనే ఉద్దీపనంవల్ల ఉత్తమ కావ్యనాయికలని ఆయన రూపొందించ కలుగుతున్నాడు. ఆయన భార్య, అపురూప లావణ్యరాశి అయివుండాల్సి లేకపోతే అటువంటి ప్రియురాలెవరైనా కవిగారి హృదయాన్ని కలవర పరిచి వుండాలి. ఈ సంగతి తేల్చుకోవాలని శర్మ ఒక నడివేసవికాలంలో నిశ్చయించుకున్నాడు కవిగారికి, ముందుగా ఉత్తరం రాయలేదు, ఒక బుట్టెడు మామిడి పళ్లు కానుకగా పట్టుకుని వెళ్లాడు.

కవిగారు వుండే వూరు పదిమైళ్ళదూరం వడగాలి ఆ చెవులోంచి ఈ చెవులోకి కొడుతోంది. ఎండ నిప్పులు చెరిగిపోస్తోంది.

కాకులు నోళ్ళు తెరుచుకుని నీళ్ళకోసం వెంపరలాడుతున్నయ్. ఇసక నేలలో సైకిలుపోక దిగినడవాల్సి వచ్చింది. జనసంచారంలేని ఆ ప్రదేశంలో ఎండ మావులు దూరానకదులుతున్నాయి. వేడి ఆవిర్లు కళ్ళముందు పొగలాగా తేలు తున్నాయి. లోకమంతా తపించిపోతున్నా నా ఆనందంనాది అన్నట్లు ఎర్రతంగేడు పూలగుత్తులు విరబోసుకుంటున్నాయి.

బట్ట తలల్లాగా వున్నాయి కొండలు పచ్చగడ్డి అయినా లేదు పైన వంకర టింక రలుగా ఎదిగిన తుమ్మచెట్లు, ఓరారుగా నిలి చిన తాటిచెట్లూ వాటిమధ్య ఒక పూరిపాక. అదే కవిగారి ఏకాంత సదనం అని ఆరా తీయగా తెలిసింది మనస్సులోని మాధు ర్యమూ, జీ వి త ం లో ని భావుకత్వమూ హరించి వేసేట్లుగావుంది అతీషణ గ్రీష్మ తాపం, ఇటువంటి పరిసరాల్లో రమణీయ కావ్యసృష్టి ఎల్లా చేస్తున్నారీయన అని ఆశ్చర్యపడ్డాడుశర్మ.

అనుకున్నంతా జరిగింది. కవిగారు ఊళ్లోలేరు. ఎప్పుడు వస్తారో తెలియదుట.

"వారు నాకు ఆప్తమిత్రులు లెండి...."

"మీ పేరు ?"

"శర్మ అంటారు లెండి"

"వచ్చాక ఏమైనా చెప్పమంటారా ?"

"వారి శ్రీమతికూడా వెళ్లారా? "అన్నాడు శర్మ. తన ఎదటవున్న ఆవిడ వంట మనిషికాబోలు. లేక ఎవరైనా చుట్టం కాబోలు అనుకుని.

'వెళ్తే మీకు జవాబు ఎవరు చెబుతారు?'

అని కొంచెం నొచ్చుకున్నట్లు కోపంగా అంది.

మనిషి పిట్టలాగా వుంది. పీచులాగా రేగిన బిరుసు జుట్టు. చింతాకుల్లాగా చిన్న కళ్ళు.... చిట్లించే చూపులు. పూచల్లాగా వున్న కాళ్లూ చేతులూ. ఉబ్బ సం జబ్బు కాబోలు. దూరంనుంచీ ఆయాసమూ పిల్లికూతలూ వినిపిస్తున్నాయి. మూర్ఛపోయినంత పని అయింది శర్మకి. అరకాలికింద నేల అణగారిపోతున్నట్లని పించింది. ముచ్చెమటలు పోశాయి.

మామిడిపళ్ళ బుట్ట అక్కడపెట్టి ఉత్తరీయంతో చెమట విసురుకుంటూ "వెళ్ళి వస్తానండి" అన్నాడు.

"కొంచెం దాహం పుచ్చుకోండి" అని గ్లాసులో మజ్జిగతెచ్చి ఇచ్చింది. ఒక్క గుక్కలో తాగేసి "వస్తానండి" అన్నాడు.

"మీకు నామీద కోపంగా వుందికదూ? నాకు తెలుసు ఆయన అభిమానులు చాలామంది మీలాగేవచ్చి వెళ్తూ వుంటారు. పాపం. మంచి ఎండలో వచ్చారు, చాలా శ్రమపడి వచ్చినట్లున్నారు. ఇన్నాళ్లా ఎవరితోనూ నేను మాట్లాడి ఎరగను కాని ఇవాళ మీతో ఒక సంగతి చెబుదామని పిస్తోంది...."

"తప్పకుండా చెప్పండి నా అదృష్టం"

"మీ కవిగారికి నేను ఏ విధంగా చూసినా తగను. ఆ సంగతి నాకూ తెలుసు. నాలాంటి కురూపిభార్య దొరకటంవల్లనే వారు అంత అందమైన కావ్యనాయికలని సృష్టించి మిమ్మల్ని మురిపించగలుగు తున్నారు...."

బిత్తరపోయినట్లు చూస్తున్నాడు శర్మ.

"అవునండీ! మమ్మాటికీ నిజం జీవి తంలో తీరని కోరికలనే కావ్యప్రపంచంలో కవి హృదయం తనివితీరా అనందించి సంతృప్తి పొందుతుంది. నేనే అందకత్తె నయివుంటే వారు రమణీయ స్వప్నాలు కనేవారుకారేమో! లేనిదానికోసమే మానవ హృదయం అర్రులు చాచి, కరాలుచాచి కలవరిస్తుంది. తీరని వాంఛలలోంచి, భగ్నస్వప్నాలలోంచి సృష్టిలోని కావ్యాలూ శిల్పాలూ ఉద్భవిస్తున్నాయి అన్నీ అమరి అందుబాటులోవుండి, వడ్డించిన విస్తరి లాగున్న జీవితం మందగొడిగా మన్ను తిన్న పాములాపడి వుంటుంది. తీరని అసంతృప్తితో రగిలిపోయే జీవితం పొందే వేదనలే మాధురులవుతాయి, గుండెల్ని అణగదొక్కే భారమే సురభిళసుమహారం అవుతుంది కళారాధకుడి చేతుల్లో!" అంది ఏదో గంభీరసత్యాన్ని దర్శించిన ప్రవక్త లాగా.

సుడులు తిరిగే ఆలోచనల్తో పలాయనం పట్టాడు శర్మ షాక్ తగిలినట్లయింది.

—:o:—

వివేకానందవాణి :

## శక్తి

గొప్ప పనులు చేయడానికి మీరు జన్మిం చారన్న విశ్వాసం కలిగివుండండి.

కుక్కపిల్లల మొరుగుడుకాని, స్వర్గ లోకపు పిడుగు చప్పుళ్ళుకాని మిమ్మల్ని భయపెట్టకుండా ఉండుగాక. నిలబడి పని చేయండి.

మీ దేశానికి వీరులు కావాలి శిలలా స్థిరంగా నిలబడండి, సత్యం ఎల్లప్పుడూ జయిస్తుంది. జాతీయ నాడులలో నూతన శక్తిని రేకెత్తించే నూతన విద్యుత్ భారత దేశానికి కావాలి

ధైర్యంగా వుండండి మానవుడు మరణించేది ఒకేసారి. నా శిష్యులు పిరికి పందలు కారాదు. పిరికితనాన్ని నేను అసహ్యించుకుంటాను, గంభీరతమమైన మానసిక నిశ్చలత్వాన్ని కలిగి వుండండి. ఇతరులు మీకు వ్యతిరేకంగా ఏం చెప్పినప్పటికీ - ఒక్క రవ్వకూడ ఖాతరు చేయవద్దు-నిర్లక్ష్యం, నిర్లక్ష్యం, నిర్లక్ష్యం- ఉన్నవి రెండు కళ్ళని.... రెండు చెవులని- కాని నోరుమటుకు ఒకటేనని గుర్తుంచు కోండి ఘనకార్యాలన్నీ బలమైన అడ్డం కులను అధిగమించడంద్వారానే సాధిం డ్డాయి. నీ పురుషశక్తిని ముందు వుం చండి. కామినీ కాంచనాల ప్రభావంలో వున్న క్షుద్రులను నిర్లక్ష్యంతో చూడాలి.

ఎందుకు దుఃఖిస్తున్నావు మిత్రమా! నీలో యావత్తుశక్తి వుంది, నీలోని సర్వ శక్తివంతమైన ప్రకృతిని పిలువు - ఓశక్తి మంతుడా ఈ విశ్వమంతా నీపాదాల చెంత వుంటుంది.

—o—